తెలుగు తల్లీ.. మన్నించు!!

'చెరకు రసమ్ముల కన్న, ప్రవచింప తేని యజాలుకన్న, భాసుర సుధకన్న, తియ్యనగు చూతఫలంబులకన్న, తెలుగుభాష తియ్యనురా' అని ఓ మహాకవి మాట. అలాంటి భాషకు మూలమైన తెలుగు తల్లి విగ్రహ స్థాపనపై పల్నాడు జిల్లాకేంద్రంలో మీన–మేషాలు లెక్కిస్తున్నారు. గతంలో ఉన్న స్థలం నుంచి తెలుగుతల్లి విగ్రహాన్ని తొలగించి వేరొక చోట పెడతామన్న యంత్రాంగం మాటలు ఇవాళ నమ్మలేనివిగా మారాయి. పైగా తెలుగు తల్లి విగ్రహాన్ని పెట్టిన ప్రాంతాన్ని తమ వశం చేసుకునేందుకు కొందరు నేతలు ప్రయత్నాలు చేసుకుంటున్నారనే విమర్శలు పట్టణంలో విస్తృతంగా సంచారం చేస్తున్నాయి.

- విగ్రహ ఏర్పాటులో రాజకీయ గ్రహణం
- పూర్వ స్థలంపై టీడీపీ నేతల కన్ను


తెలుగుతల్లి విగ్రహం తొలగించగా మిగిలిన దిమ్మె

నరసరావుపేట: స్థానిక స్టేషన్ రోడ్డులోని ఆర్‌యూబీ పక్కనే మున్సిపల్ స్థలంలో ఆరేళ్ల క్రితం ఏర్పాటు చేసిన తెలుగుతల్లి విగ్రహం తరలింపు పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ విగ్రహం ఏర్పాటు చేసిన స్థలం మల, మూత్రాలకు నిలయంగా మారడంతో ప్రజాప్రతినిధుల సూచనల మేరకు పక్కనే ఉన్న గాంధీ పార్కులో ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే తొలగించిన స్థలం సుమారుగా 20 సెంట్ల వరకు ఉంటుంది. మంచి సెంటర్‌లో స్థలం కావటంతో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంది. సుమారు రూ.5 నుంచి రూ.6 కోట్ల వరకు ధర పలుకుతుంది. దీనిని కబ్జా చేయాలనే ఉద్దేశ్యంతో స్థానిక ముఖ్యనేత సహచరులు ఒక పథకం ప్రకారం ప్రణాళిక రచించి విగ్రహాన్ని మార్పు చేశారనే ప్రచారం పట్టణంలో చెక్కర్లు కొడుతోంది. దీంతో పాటు సమీపంలోని కేబీఆర్ పార్కు సెంటర్‌లోని తోపుడు బండ్ల వ్యాపారుల వద్ద ఓ వ్యక్తి ఆ స్థలంలో జాగా ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలియవచ్చింది. గత ఆరేళ్ల క్రితం ఆర్‌యూబీ ప్రారంభించిన అనంతరం దాని పక్కనే ఉన్న ఈ స్థలంలో ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తలంపు చేశారు. అయితే ప్రజల దృష్టి పడదనే ఉద్దేశ్యంతో ఆర్‌యూబీకి ఎదురుగా రోడ్డుపై విగ్రహం ఏర్పాటు చేసి భవిష్యత్‌లో ఈ స్థలంలో మరొకరు ఏ విగ్రహాలను ఏర్పాటు చేయకూడదనే ఉద్దేశ్యంతో తెలుగుతల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారనే ప్రచారం జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినా, మున్సిపల్ కార్యవర్గం లేకపోవడంతో దీని గురించి ఎవరూ పట్టించుకో లేదు. సమయానుకూలంగా ఆ స్థలాన్ని బాగుచేసి విగ్రహానికి దండలు వేయడం చేశారు. తొలుత ఈ స్థలాన్ని శుభ్రంగానే ఉంచే మున్సిపల్ అధికారులు క్రమేణా ఎవరూ పట్టించుకోకపోవటంతో చుట్టుపక్కలనున్న వ్యాపారులు తమ మల, మూత్రాల విసర్జనకు ఉపయోగించుకోవటం మొదలు పెట్టారు. దీనిని నివారించేందుకు మున్సిపల్ అధికారులు ఏనాడు ప్రయత్నాలు చేయలేదు. సరైన ఏర్పాట్లు చేయలేదు. దీంతో ఈ ప్రాంతం మొత్తం అపరిశుభ్రంగా మారింది. ఎప్పటికప్పుడు ఈ స్థలాన్ని బాగుచేస్తుంటే ఎవరూ అపరిశుభ్రం చేయకుండా ఉండేవారనే వాదన ప్రజల నుంచి వినిపిస్తుంది. నాలుగు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వ పెద్దల కన్ను ఆ విగ్రహ స్థలంపై పడింది. దీనిని ఏమి చేస్తారో వేచి చూడాల్సి ఉంది. దీనిపై మున్సిపల్ కమిషనరు ఎం.జస్వంతరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించలేదు.

క్లుప్తంగా

నోటరీగా దాసరి చిట్టిబాబు



చిలకలూరిపేట: భారత ప్రభుత్వ నోటరీగా న్యాయవాది దాసరి చిట్టిబాబు తిరిగి నియమితులయ్యారు. గత ఐదేళ్లుగా ఆయన నోటరీగా సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మారో ఐదేళ్ల పాటు ఆయనను నోటరీగా నియమించటంతో 2029 అక్టోబర్ వరకు ఆయన నోటరీగా వ్యవహరిస్తారు. చిట్టిబాబు గతంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా పనిచేశారు. ప్రస్తుతం పలు బ్యాంకులకు న్యాయ సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. ఆయన తిరిగి నోటరీగా నియమితులు కావడం పట్ల పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



ఈపూరు: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వెల్లడించారు. ఈపూరు మండల పరిషత్ కార్యాలయంలో అన్నీ శాఖల అధికారుల సారథ్యంలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. పోలీసు, రెవెన్యూ, పంచాయతీ సంబంధించిన సమస్యలు సత్వరమే పరిష్కరిస్తామన్నారు. ఒక్కో మండలంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు నళిని, ఎంపీడీవో ప్రభాకర్, ఎస్సై ఉమామహేశ్వర రావు, ప్రజాప్రతినిధులు, మండల గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.

తుపాను దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

నాదెండ్ల: తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈ నెల 17 వరకూ భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని తహసీల్దార్ ఏవీ రమణ తెలిపారు. తన కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా నాలుగు రోజులపాటూ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు పొంగి ప్రవహించే అవకాశం ఉన్నందున చప్టాల వద్ద రాకపోకలను నియంత్రించాలన్నారు. పురాతన మట్టిమిద్దెలు కూలే అవకాశం ఉన్నందున ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని కోరారు.

టౌన్ బాప్టిస్టు చర్చి ఫాస్టర్ ఎలీషాకు ఘన సన్మానం



నరసరావుపేట: ప్రపంచ పాస్టర్స్ డే సందర్భంగా స్థానిక టౌన్ బాప్టిస్టు చర్చి పాస్టర్ రెవరెండ్ మున్నంగి ఎలీషాను సంఘ విశ్వాసులు ఆదివారం సాయంత్రం చర్చిలో ఘనంగా సన్మానించారు. సంఘ విశ్వాసకులు పంగులూరి విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత 17ఏళ్ల నుంచి టౌన్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్‌గా కొనసాగుతూ సంఘ విశ్వాసులు మధ్య ఐక్యమత్యం, సంఘ అభివృద్ధికి తోడ్పడ్డారన్నారు. సంఘ విశ్వాసులు తెలగలపూడి ఆనంద్ బెంజిమెన్, కందుకూరి చిన్న మాస్టర్, నూనె గురవయ్య, జంగాల నవబాబు, తలారి శ్యాము, రాజేంద్ర, లింగయ్య, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ


పారిశుద్ధ్య కార్మికులకు నూతన దుస్తులు అందజేస్తున్న దృశ్యం

మాచర్ల: పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండుగ సందర్భంగా నూతన వస్త్రాలను పురపాలక సంఘ చైర్మన్ పోలూరి నరసింహారావు, ఆర్యవైశ్య నాయకుడు కంభంపాటి అనిల్‌లు అందజేశారు. సోమవారం 100 మంది కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. కంభంపాటి అనిల్ సౌజన్యంతో కార్యక్రమం నిర్వహించామని, రాబో యే రోజుల్లోనూ ప్రతి కార్మికుడికి ప్రయోజనం కల్పించేలా చర్యలు తీసుకొని సౌకర్యాలు కల్పించేలా తన వంతు కృషి చేస్తామని చైర్మన్ పోలూరి నరసింహారావు అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు పాత్ర చాలా కీలకం

ఆంగ్ల బోధకులు నాగేశ్వరరావు


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

శావల్యాపురం: సమాజంలో ఉపాధ్యాయులు పాత్ర చాలా కీలకమైందని శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల సీనియర్ ఆంగ్ల బోధకులు స్టాఫ్ సెక్రటరీ బెజవాడ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.విజయలక్ష్మి (రోటరీ క్లబ్ గుంటూరు) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కుమ్మరి శ్రీనివాస రాజు, పీడీ రాగుల రాధాకృష్ణ మూర్తిలకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఆంగ్ల బోధకులు బెజవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాలతో పాటు సమాజ భాగస్వాములై భావితరాలకు విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు సమాజానికి మార్గదర్శకంగా మెలగాలన్నారు. సామాజిక సేవా భావం కల్గియున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం గుర్తించటం అభినందనీయమన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా పూలమాలలు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ

నరసరావుపేట రూరల్: గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని రావిపాడు, లింగంగుంట్ల, అల్లూరివారి పాలెం, ఇక్కుర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో మంజూరైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.4500 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 వేల పనులకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు ఏర్పాట్లు పనులను వేగవంతం చేసినట్టు తెలిపారు. కార్యక్రమాల్లో పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమాలు


చినకంచర్ల ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో పాల్గొన్న అధికారులు ప్రజాప్రతినిధులు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల, పిచికలపాలెం గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అధికారుల సారధ్యంలో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పల్లెపండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో ఉపాధి నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, మినీ గోకులం షెడ్లు, తదితర అభివృద్ధి పనుల్లో ప్రజలందరు భాగస్వామ్యం కావాలన్నారు. అనంతరం చినకంచర్ల గ్రామం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పురేటి నాగేశ్వరరావు, గణపర్తి ఆంజనేయులు, పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వరస్వామి, ఏపీవో కె.రామారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి, ప్రజాప్రతినిధులు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రొంపిచర్ల....

రొంపిచర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పల్లె పండుగ' కార్యక్రమం మండలంలోని పరగటిచర్ల గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పంచాయతీ రాజ్ ఏఈ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి పూర్తిచేయటమే పల్లెపండుగ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ మేరకు గ్రామంలోని ఉపాధిహామీ కూలీలు, నాయకులతో చర్చించారు. ఈ పథకం కింద గ్రామంలోని సైడ్ కాలువలు, రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. నూతనంగా చేపట్టనున్న పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ ఇజియస్ ఎపిఎం ప్రసాద్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్నవలో..

నాదెండ్ల: యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో సోమవారం పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పల్లెపండుగ నిర్వహించారు. ఎంపీడీవో హేమలతాదేవి, సర్పంచ్ సరళతో పాటూ గ్రామనాయకులు కుర్రా రత్తయ్య, బాలినేని హనుమంతరావు, కాకుమాను శ్రీనుతో కలిసి రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఉపాధిహామీ పథకం సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా 'టుబాకో ఫ్రీ స్కూల్' కార్యక్రమం


ప్లకార్డులు చూపిస్తున్న విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం 'టుబాకో ఫ్రీ స్కూల్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవి నాయక్ మాట్లాడుతూ పొగాకు వాడకం ఎంతో హానికరమని అన్నారు. పొగాకు తాగినా, పీల్చినా, నమిలినా, క్యాన్సర్ లాంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయన్నారు. విద్యార్థులు పాఠశాల, ఇంటి పరిసర ప్రాంతాలలో పొగాకు వలన కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించి, చైతన్య పరచాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులు విద్యార్థులచే పొగాకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. అదే విధంగా విద్యార్థులచే నినాదాలు చేయించి, ప్లే కార్డులు ప్రదర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఉచిత వినికిడి పరికరాల కోసం 98 మంది దరఖాస్తు

నరసరావుపేట: పాత గవర్నమెంట్ హాస్పిటల్‌లోని జిల్లా సత్వర చికిత్స కేంద్రం (డీఇఐసీ)లో నేషనల్ ప్రోగ్రాం ఫర్ ప్రివేన్షన్ అండ్ కంట్రోల్ అఫ్ డెఫ్నెస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉచిత వినికిడి పరీక్షలు, పరికరాల కొరకు దరఖాస్తులు స్వీకరించామని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. దీనిలో 98 మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వీరికి త్వరితగతిన వినికిడి మిషన్‌లు అందిస్తామని చెప్పారు.

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి



బెల్లంకొండ: అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వనజ తెలిపారు. సోమవారం వెంకటాయపాలెం గ్రామంలోని ఎస్టీ కాలనీలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పౌష్టికాహార పదార్థాలను అందించాలని, ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని సూచించారు. ఆమె వెంట గ్రామ సర్పంచ్ ముఖ్య నాగమ్మ బాయి, శ్రీను నాయక్, నాయకులు ఉన్నారు.

పాఠశాలకు ప్రింటర్, మైక్‌సెట్ బహూకరణ


తిమ్మాపురం హైస్కూలుకు ప్రింటర్, మైక్‌సెట్ బహూకరిస్తున్న రిటైర్డ్ టీచర్ కాటూరి కృష్ణన్

నాదెండ్ల: తాను పనిచేసిన పాఠశాల అభివృద్ధికి తన వంతుగా సాయమందించటం సంతోషంగా ఉందని ఉద్యోగ విరమణ చేసిన పీఈటీ కాటూరి కృష్ణన్ చెప్పారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సోమవారం కృష్ణన్, ఆయన సతీమణి రాజేశ్వరి రూ.30 వేలు విలువైన ప్రింటర్, మైక్‌సెట్‌లను పాఠశాలకు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం వెంకటాద్రినాయుడు మాట్లాడుతూ, కృష్ణన్ తన ఉద్యోగ జీవితంలో ఎంతో మంది విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్ది వారి అభ్యున్నతికి విశేషంగా దోహదపడ్డారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లగూర ప్రభావతి, గ్రామపెద్దలు పావులూరి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ ఎలికా రాఘవులు, పాపసాని రాజేశ్వరి, పావులూరి పిచ్చయ్య, చంద్రశేఖర్, పుల్లగూర రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సూడిగేదెకు ఒకే రోజు రెండు ఆపరేషన్లు

- ప్లాస్టిక్ కవర్లు తిని ప్రాణం మీదకు తెచ్చుకున్న పశువు
- గేదెను, దూడను కాపాడిన డాక్టర్లు


ఆరోగ్యంగా ఉన్న దూడ, గేదె

రొంపిచర్ల: ప్లాస్టిక్ కవర్లు మింగి మూడు రోజుల పాటు ప్రాణాలతో పోరాడుతున్న సూడి గేదెకు ఒకే రోజు రెండు ఆపరేషన్‌లు నిర్వహించి గేదెను, దూడను కాపాడిన సంఘటన పల్నాడు జిల్లా గురజాల మండలం మాడుగుల గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. వివరాల్లో కెళితే.. మాడుగుల గ్రామానికి చెందిన నీలం పిచ్చయ్య అనే రైతు గేదె నిండు సూడిగా ఉండి మూడు రోజులుగా మేత, నీళ్లు తాగడం లేదు. నీళ్లు తాగినా బయటకు వస్తున్నాయి. వెంటనే ఆ గ్రామ సచివాలయానికి చెందిన పశువైద్య సహాయకులు రొంపిచర్ల మండలంలోని కర్లకుంట, సంతగుడిపాడు గ్రామానికి చెందిన పశు వైద్యాధికారులు డాక్టర్ సాయి మహేష్‌రెడ్డి, శ్రీకాంత్‌లకు విషయం తెలియజేశారు. ఆ గేదెను పరీక్ష చేసేందుకు ఇరువురు డాక్టర్లు హుటాహుటిన మాడుగులకు బయలుదేరి వెళ్లారు. నిండు సూడిగేదెను అన్ని విధాల పరీక్షించారు. మూడు నాలుగు రోజుల పాటు మేత, నీళ్ల లేనప్పటికీ గేదె నీరసించి, ఆరోగ్యంగా ఉంది. కడుపులో ఉన్న దూడ కూడా ఆరోగ్యంగా ఉన్నట్లు భావించారు. వెంటనే గేదెకు ఆపరేషన్ చేసి దూడను తీశారు. గేదె గొంతు అన్న వాహికలో ఏదో ఒక పదార్థం అడ్డు పడిందిగా భావించారు. వెంటనే అపరేషన్ చేసి గొంతులో ఉన్న కేజీన్నర బరువు గల ప్లాస్టిక్ మూటను బయటకు తీశారు. ఆ పశువుకు అన్ని రకాల చికిత్సలు నిర్వహించి ప్రాణాన్ని నిలబెట్టారు. లక్ష రూపాయల విలువ చేసే పశువు ఆరోగ్య పరిస్థితులను చక్కదిద్దిన డాక్టర్‌లకు రైతు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్‌లు మాట్లాడుతూ మేతలో వచ్చే ప్లాసిక్ కవర్ల వల్ల ఇలాంటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, రైతులు పశువులను గమనించి ఉండాలన్నారు. ఇలాంటి ఇబ్బందులు ఏర్పడినప్పుడు పశువులు చనిపోయి నష్టం వాటిల్లుతుందన్నారు. రైతులు జాగ్రత్త వహించి ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు పశువైద్యులను సంప్రదించి పశువుల ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.


గొంతు నుంచి తీసిన ప్లాస్టిక్ కవర్లు

నేడు అబ్దుల్ కలాం జయంతిని జయప్రదం చేయండి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం 94 జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక పల్నాడు రోడ్డులోని కలాం విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించనున్నామని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం పేర్కొన్నారు. కావున ఈ కార్యక్రమానికి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ పట్టణ, వార్డు ఇన్చార్జులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు అందరూ స్థానిక గుంటూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వద్దకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనధీకృత పురుగు మందులు స్వాధీనం


సత్తెనపల్లిలో స్వాధీనం చేసుకున్న పురుగు మందు నిల్వలు

ముప్పాళ్ళ(సత్తెనపల్లి): వడ్డవల్లిలోని అంజనేయ స్వామి గుడి ప్రాంతంలోని గొడౌన్‌లో 418 లీటర్లు, రూ.5,85,240లు విలువ చేసే అనధీకృత పురుగుమందు నిల్వలను స్వాధీనం చేసుకున్నట్లు సత్తెనపల్లి ఇన్‌చార్జ్ సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సమాచారం మేరకు.. వడ్డవల్లి వీఆర్వో అనిల్ ఆధ్వర్యంలో తనిఖీలు జరపగా గొడౌన్ లో పురుగు మందులు నిల్వలు గుర్తించామని అధికారులు తెలిపారు. విచారణ జరపగా నిల్వలు పట్టణంలోని శివశంకర ఫర్‌టిలైజర్స్ కు చెందిన నిర్ధారించడం జరిగిందన్నారు. ఈ గొడౌన్ సంబంధిత దుకాణానికి జతపరచలేనందున నిల్వలన్నీ అనధీకృత పురుగుమందులుగా గుర్తించామన్నారు. బీఏఎస్ఎఫ్‌కు చెందిన పురుగు మందులు 26లీటర్లుకు గాను రూ.61,500, బెస్ట్ అగ్రో లైఫ్ లిమిటెడ్ కంపెనీకి సంబందించిన పురుగుమందులు 70 లీటర్లు గాను రూ.1,10,300లు, పీఐ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి సంబందించిన పురుగు మందులు 320లీటర్లుకు గాను రూ.4,13,440లు నిల్వలున్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. సీజ్ చేసిన మందులను భద్రతా చర్యల్లో భాగంగా పట్టణంలోని ఆదిత్య సీడ్స్ పురుగు మందుల దుకాణంలో ఉంచటం జరిగిందన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు



రెంటచింతల: రైతులకు ఎరువులు, పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని మండల వ్యవసాయ అధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన రెంటచింతలలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి ఆయన మాట్లాడారు. సీపీలు లేకుండా ఎరువులు, పురుగు మందులు రైతులకు అమ్మడం చట్టప్రకారం నేరమన్నారు. ఎప్పటికప్పుడు షాపులలో ఉన్న ఎరువులు, పురుగు మందుల వివరాలు, క్రయ, విక్రయాలకు సంబంధించి సమాచారం స్టాక్ రికార్డులలో నమోదు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు, పురుగు మందులకు ఇచ్చే బిల్లులో తేదీ, బ్యాచ్ నంబర్, లాట్ నంబర్ నమోదు చేయాలన్నారు. షాపులో స్టాక్ వివరాల రికార్డు ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. రైతులు అడిగిన రసాయనిక మందులను మాత్రమే ఇవ్వాలన్నారు. అనుమతి లేని మందులను, ఎరువులను విక్రయించిన అటువంటి షాపు నిర్వాహకులపై తీవ్రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పలువురు ఉద్యోగులు బాధ్యతల స్వీకారం

మాచర్ల రూరల్: ఉద్యోగుల సాధారణ బదిలీలలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్‌గా గుంటా వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. ఈమె గురజాల ఆర్డీఓ ఆఫీసులో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ బాషా వెల్దుర్తి మండలానికి వెళ్లారు. ఎన్నికల సీనియర్ అసిస్టెంట్‌గా చేవూరి రామాంజనేయులు నియమితులయ్యారు. ఈయన గురజాల ఆర్డీఓ ఆఫీసులో పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న షేక్ మస్తాన్‌వలి వెల్దుర్తి మండలానికి వెళ్లారు. కొత్తపల్లి వీఆర్ఓగా షేక్ ఖాజావలి నియమితులు కాగా ఈయన దాచేపల్లి మండలం మాదినపాడు వీఆర్ఓగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు వారు తహసీల్దార్ ఎండీ జియా ఉల్‌హక్‌కు నియామక ఉత్తర్వులు అందించి విధుల్లో చేరారు.

ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే వ్యక్తి తిప్పారెడ్డి


తిప్పారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

రొంపిచర్ల: ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే వ్యక్తి పెద తిప్పారెడ్డి అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన మాజీ సర్పంచ్ జక్కిరెడ్డి పెద తిప్పారెడ్డి సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పెద తిప్పారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కురుగుంట శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పచ్చవ రవీంద్రబాబు, మాజీ సర్పంచ్‌లు చీమల శ్రీనివాసరెడ్డి, కోడూరి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను తొలగించడం అన్యాయం

కలెక్టర్, ఆర్డీవోలను కోరిన సీఐటీయూ నాయకులు


నినాదాలు చేస్తున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: రాజకీయ కారణాలతో తొలగించిన మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగ ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకొని వారికి రెండు నెలల జీతం బకాయులను చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయాల ఎదుట ధర్నా చేసి ఆయా కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ తొలగించబడిన 15మంది కార్మికులు గత పది, పదిహేను ఏళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. వీరిని అర్ధాంతరంగా విధుల్లోకి రావొద్దని మున్సిపల్ కమిషనర్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వీరికి చెల్లించే జీతాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐలకు డబ్బులు కట్ చేశారన్నారు. ఇప్పుడు వీరిని ఉద్యోగాలకు రావొద్దని చెప్పి వారి కుటుంబ సభ్యులను మానసిక సంక్షోభానికిగురిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ శిలార్, పట్టణ గౌరవాధ్యక్షుడు షేక్ చిన్న అల్లాబక్షు, షేక్ సైదా, బి.నాగమల్లేశ్వరి, ఏ.పద్మ, రమాదేవి, షేక్ మహబూబుబాష పాల్గొన్నారు.